సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

పంట రుణాలకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నిర్ధారణ

- కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రైతులకు పంట రుణాలు మంజూరుకు సంబంధించి స్కేల్ఆఫ్ఫైనాన్స్ నిర్ధారించామనిజిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష తెలిపారు. శుక్రవారం డిస్ట్రిక్ట్ కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సాంకేతిక సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు.కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ, మత్స్యశాఖ, ఉద్యాన, పశుసంవర్ధక శాఖలకు సంబంధించి వివిధ రకాల రుణాల మంజూరు కోసం స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ను నిర్ధారించామన్నారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ వరి పంటకు ఎకరాకు ఖరీఫ్‌లో రూ.46 వేల నుంచి రూ.50 వేలు, జొన్న పంటకు ఎకరాకు రూ.22 వేల నుండి రూ.24 వేలు, కొర్ర పంట కు ఎకరాకు రూ.15 వేల నుండి రూ.16 వేలు, కంది పంటకు ఎకరాకు రూ.22 వేల నుండి రూ. 25 వేలు, పెసరపంటకు ఎకరాకు రూ.22వేల నుండి రూ.24 వేలు నిర్ధారించామన్నారు. వేరుశనగ, పసుపు, మామిడి, జామకాయ, సపోటా, టమాటో, రోజా పూలు, కనకాంబరాలు, పుచ్చకాయ, ఆముదం, దానిమ్మ, బంతిపూలు తదితర ఉద్యాన పంటలకు కూడా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నిర్ణయించామన్నారు. జెర్సీ ఆవులు, గేదెలు, పొట్టేళ్ళు, పౌల్ట్రీ లకు సంబంధించిన దాణా, వెటర్నరీ ఎయిడ్ కి, మత్స్యశాఖకు సంబంధించి ఫిష్ కల్చర్, నెట్స్ తదితర అంశాలకు సంబంధించి స్కేల్ జిల్లా స్థాయి సాంకేతిక కమిటీ ఆధ్వర్యంలో స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నిర్ణయించామన్నారు. పెంచిన వివరాల ప్రతిపాదనలను రాష్ట్ర స్థాయి సాంకేతిక కమిటీకి పంపించే విధంగా చర్యలు తీసుకోవాలని కెడిసిసి బ్యాంక్ సిఇఒను ఆదేశించారు. అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, కెడిసిసి బ్యాంక్ సిఇఒ విజయ్ కుమార్, డిసిసి బ్యాంక్ జనరల్ మేనేజర్ రామాంజనేయులు, ఎల్‌డిఎం రామచంద్రరావు, నాబార్డ్ డిడిఎం సుబ్బారెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, ఉద్యాన శాఖ అధికారి, బ్యాంకర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

'ఇంటర్'కూ మధ్యాహ్న భోజనం

- 23 కళాశాలలో అమలుకు చర్యలు
- 8679 మంది విద్యార్థులకు లబ్ధి
- నేడు కర్నూలులో ప్రారంభించనున్న సిఎస్

కర్నూలు జూనియర్ కళాశాల (టౌన్ మోడల్)

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా మధ్యాహ్నం భోజన పథకం అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ పాఠశాలల్లో మ్యాపింగ్ చేస్తూ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ఇకనుండి మధ్యాహ్నం ఆహారాన్ని అందించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ శనివారం కర్నూలు జగన్నాథ గట్టు సమీపంలో ఉన్న ఎపి రెసిడెన్షియల్ , బి క్యాంపు లో ఉన్న ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ప్రారంభించనున్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కేవలం పాఠశాల విద్యార్థులకే అమలు అవుతుంది. ఇప్పుడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా అమలు చేసేందుకు ప్రభుత్వ చర్యలు తీసుకుంది. జిల్లాలో మొత్తం 23 జూనియర్ కళాశాలలో ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. ప్రస్తుతం జూనియర్ కళాశాల సమీపంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల నుండి మధ్యాహ్నం భోజనాన్ని తయారుచేసి ఇక్కడ విద్యార్థులకు అందజేయనున్నారు. ఇప్పటికే జూనియర్ కళాశాలలో ప్రభుత్వ పాఠశాలలతో మ్యాపింగ్ కూడా పూర్తి చేశారు. జిల్లాలో మొత్తం 8679 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయనున్నారు.

మధ్యాహ్న భోజన పథకం అమలు ఇలా....

జూనియర్ కళాశాలలోని ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని ఇలా అమలు చేయనున్నారు. ఒక విద్యార్థికి 150 గ్రాముల అన్నం, ఐదు రోజులు గుడ్లు, మూడు రోజులు బెల్లం చిక్కీలు అందించనున్నారు. సోమవారం కూరగాయలతో తయారుచేసిన పలావ్ కోడిగుడ్డు కూర, బెల్లం చిక్కి, మంగళవారం నాడు పులిహోర, దొండకాయ పచ్చడి, రాగి జావా, కోడిగుడ్డు, బుధవారం కూరగాయల అన్నం, ఆలూ కుర్మా, కోడిగుడ్డు, బెల్లం చిక్కి, గురువారం సాంబార్ బాత్ లేదా లెమన్ రైస్, టమోటా పచ్చడి, కోడిగుడ్డు, శుక్రవారం అన్నం ఆకుకూర పప్పు కోడిగుడ్డు, బెల్లం చిక్కి, శనివారం ఆకుకూర, అన్నం పప్పు, చారు రాగి జావా స్వీట్ పొంగల్ అందించనున్నారు.

విద్యార్థులకు ఎంతో ఉపయోగ కరం

- సి.సుంకన్న ప్రిన్సిపల్ టౌన్ మోడల్ జూనియర్ కళాశాల

ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజనం పథకాన్ని అమలు చేయడం నిరుపేద విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. మా కళాశాలలో దాదాపుగా 1000 మంది విద్యార్థులకు ఈ పథకం లబ్ధి చేకూరుతుంది. మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేసేందుకు కూడా చర్యలు తీసుకుంటున్నాం.

ఐసిఎంఆర్‌కు 5 ప్రాజెక్టులు ఎంపిక

- విద్యార్థులను అభినందించిన ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

వైద్య వ్యవస్థలో అధునాతన మార్పులు, అభివృద్ధి కోసం ఢిల్లీలోని భారతీయ వైద్య పరిశోధనా సంస్థ (ఐసిఎంఆర్) దేశవ్యాప్తంగా ఉన్న మెడికల్ కాలేజీలలోని వైద్య విద్యార్థుల నుంచి పరిశోధన ప్రతిపాదనలు స్వీకరించగా కర్నూలు మెడికల్ కాలేజీలోని ఫార్మకాలజీ ఒక్క విభాగానికి చెందిన ఐదుగురు విద్యార్థుల పరిశోధన ప్రతిపాదనలకు అనుమతి లభించిందని కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ తెలిపారు. ఫార్మకాలజీ విద్యార్థులను ప్రోత్సహించిన ఫార్మకాలజీ విభాగా ధిపతి డాక్టర్ రాజేష్‌ను శుక్రవారం ప్రిన్సిపల్ అభినందించారు. ఆమె మాట్లాడుతూ ప్రతేడాది వైద్య విభాగంలో పరిశోధన నిమిత్తం ఐసిఎంఆర్ ప్రతిష్టాత్మకంగా కొన్ని ప్రాజెక్టులను ఎంపిక చేస్తుందని తెలిపారు.. ఫార్మకాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ రాజేష్ మాట్లాడుతూ తమ విభాగానికి చెందిన వైద్య విద్యార్థుల ఐదు పరిశోధనా ప్రాజెక్టులకు ఐసిఎంఆర్ నుండి అనుమతి లభించ డం సంతోషంగా ఉందన్నారు. వైద్య విద్యార్థులు సాహితి, సుమేధ, శివసోకిత్, మొహ్మద్ అఖిత్, పిజి డాక్టర్ జ్యోత్స్నను ప్రిన్సిపల్ అభినందించారు.

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ చిట్టి నరసమ్మ

ఆక్రమణలపై 5లోపు నివేదిక

- జెసి డాక్టర్ నవ్య

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

మాట్లాడుతున్న జెసి డాక్టర్ నవ్య

జిల్లాలో పట్టణ ప్రాంతాల్లో నీటి వనరుల సంబంధించి ఐదో తేదీలోగా నివేదికను ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నీటి వనరులు, చెరువుల భూముల జిల్లాస్థాయి పరిరక్షణ కమిటీతో జాయింట్ కలెక్టర్ డాక్టర్ నవ్య సమావేశం నిర్వహించారు.ఆమె మాట్లాడుతూ జిల్లాలో నీటి వనరులు, వాటి సమీపంలో ఎలాంటి ఆక్రమణ లు ఉన్నా, వాటిపై సర్వే చేసి పూర్తి వివరాలను ఈనెల 5 వ తారీఖు లోపల సమర్పించాలని కమిటీని ఆదేశించారు. అక్కడ నిర్మాణాలు తాత్కాలికముగా ఉన్నదా? పర్మినెంట్‌గా ఉండేలా నిర్మించారా? అన్న విషయాలను సేకరించాలన్నారు. రెవెన్యూ ఇరిగేషన్ డిపార్టుమెంట్, సంబంధిత శాఖల అధికారులు సంయుక్తంగా పరిశీలించాలన్నారు. పట్టణ ప్రాంతంలో పరిశీలించే సమయంలో ఆర్‌డిఒ, తహశీల్దార్లు, మునిసిపల్ కమిషనర్లు, జలవనరుల శాఖ అధికారులు, డిపిఒ సంబంధిత అధికారులందరూ సమన్వయంతో సర్వే నిర్వహించాలన్నారు. డిఆర్ఒ సి.వెంకటనారాయణమ్మ, కర్నూలు ఆర్‌డిఒ సందీప్ కుమార్, డిపిఒ భాస్కర్, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, ఇరిగేషన్ డిపార్టుమెంట్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

సావిత్రిబాయిపూలే విగ్రహం ఏర్పాటు చేయాలి

- పూలే ఆశయాలకు పునరంకితమై పనిచేద్దాం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

మహాసాధ్వి సావిత్రిబాయి పూలే విగ్రహాన్ని కర్నూలు నగరంలో కులాల కతీతంగా ప్రభుత్వమే ఏర్పాటు చేయాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఆనంద్ బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం కర్నూలు నగరంలోని కొత్తబస్టాండ్ వద్ద ఉన్న కార్మిక కర్షకభవన్ ముందు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే 194వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కాటికాపరి గుంతలుతీసే బేగరుల సంఘం జిల్లా కార్యదర్శి ఎన్‌జి.కృష్ణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమాన్ని ఉద్దేశించి కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.ఆనంద్‌బాబు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు, ఆర్‌విఎస్, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఆర్‌టిఐ సంఘాల జిల్లా ప్రధాన కార్యదర్శులు గురుశేఖర్, నగేష్, అబ్దుల్లా, లక్ష్మీనారాయణ మాట్లాడారు. 194 సంవత్సరాల క్రితం జన్మించిన సావిత్రిబాయి, తాను పుట్టిన కాలంలో కొనసాగిన దుర్మార్గమైన సామాజిక అణిచివేతను భరించిందన్నారు. మహాత్మా జ్యోతిబాపూలే, మహిళలకు విద్యను నిషేధించిన సమాజాన్ని బద్దలు కొట్టి తన భార్యకు తానే విద్యను నేర్పి 17 సంవత్సరాల వయసుకే పూణేలో బాలికల పాఠశాలను స్థాపించి విద్యను బోధించే స్థితికి సావిత్రిబాయిని తీసుకు వచ్చారన్నారు.

నేటికీ అణచబడి ఉంచుతున్న స్త్రీలందరిలో విప్లవాగ్నిని రేకెత్తించేలా 177 సంవత్సరాల క్రితమే జ్ఞాన బోధతో మొదలుపెట్టిన ఆమె జీవితం, చివర అంకం వరకు సమాజ హితం కోసమే కృషి చేశారన్నారు. అంటరానితనానికి వ్యతిరేకంగా, వితంతు పునర్వివాహం కోసం, అనాథ శిశువుల కోసం, రోగస్తుల రక్షణ కోసం అనేక సంస్థలను ఏర్పాటు చేసి కృషి చేశారన్నారు. ఇప్పటికే నగరంలో ఉన్న జ్యోతిబాపూలే, అంబేద్కర్ విగ్రహాల చుట్టూ వారి ప్రతిమలు కనపడకుండా ఫ్లెక్స్ బ్యానర్లు కట్టి అవమాన పరుస్తున్నా.. అధికారులకు పట్టడం లేదన్నారు. వెంటనే వాటిని తొలగించకపోతే మేమే చించి వేయాల్సి వస్తుందని హెచ్చరించారు. సిఐటియు నగర కార్యదర్శి సిహెచ్ సాయి బాబా, కార్యదర్శి వర్గ సభ్యులు సుధాకరప్ప, రఫీ, లాల్, కెవిపిఎస్ న్యూ సిటీ, ఓల్డ్ సిటీ అధ్యక్షులు యేసు రాజు, రమణ, నాయకులు రాజ్‌కుమార్, మునిస్వామి, బతకన్న, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర ఉపాధ్యక్షులు హుస్సేన్ బాష, ఆర్‌విఎస్ జిల్లా ఉపాధ్యక్షులు శేషాద్రి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కర్నూలు కార్పొరేషన్ : గొప్ప సంఘసంస్కర్త సావిత్రిబాయి పూలే అని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా అన్నారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ కర్నూలు నగర కమిటీ ఆధ్వర్యంలో సిఆర్ఎంఎం మున్సిపల్ హైస్కూల్లో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎస్ఎఫ్ఐ కర్నూల్ నగర సహాయ కార్యదర్శి మల్లేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి అబ్దుల్లా, సిఆర్ఎంఎం పాఠశాల ప్రిన్సిపల్ వెంకటరెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కుమార్ మాట్లాడారు. ఆమె నిర్వహించిన ఉద్యమాలను, జీవిత అనుభవాలను వివరించారు.

కోడుమూరు రూరల్ : కోడుమూరు మండలం ఎపి మోడల్ కళాశాలలో ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చదువుల తల్లి సావిత్రిబాయిపూలే 194వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బి.రంగస్వామి మాట్లాడారు. ఎఐఎస్ఎఫ్ మండల సహాయ కార్యదర్శి వీరాంజనేయులు, మండల ఉపాధ్యక్షుడు మునిస్వామి , కళాశాల విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు కార్మిక, కర్షక భవన్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

సిపిఐ రిలే నిరాహార దీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

కర్నూలు నగరంలో ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి,ఆ స్థలాల్లో ప్రభుత్వమే గృహాలు నిర్మించి, నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం కర్నూలు ధర్నా చౌక్ వద్ద నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సిపిఐ ఆధ్వర్యంలో తలపెట్టిన రిలే నిరాహార దీక్షలను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. ఈ దీక్షలకు సిపిఐ నగర సహాయ కార్యదర్శి మహేష్ అధ్యక్షతన వహించారు. బి.గిడ్డయ్య మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ హయాంలో పేదలకు గ్రామాల్లో ఒకటిన్నర సెంటు , పట్టణాల్లో ఒక సెంటు చొప్పున ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చిందన్నారు. ఆయా ఇళ్ల స్థలాలు పట్టణాలకు సుదూరంగా, నివాసయోగ్యం కానీ ప్రాంతాల్లో కేటాయించారన్నారు. అందులో చాలామంది నిరుపేదలకు ఇప్పటివరకు ఇళ్ల స్థలాలు చూపలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలో సరైన డ్రైనేజీ వ్యవస్థను నిర్మించాలన్నారు. హంద్రీ పరివాహ ప్రాంతంలోరక్షణ గోడ లేక ప్రజలకు, మూగ జీవాలకు రక్షణ లేదని అన్నారు. విద్యుత్‌ఛార్జీలను తగ్గించాలని, ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ రిలే నిరాహార దీక్షలో సిపిఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి, నగర సహాయ కార్యదర్శులు జి.చంద్రశేఖర్, డి.శ్రీనివాసరావు, నగర కార్యవర్గ సభ్యులు ఈశ్వర్, వెంకటేష్, నల్లన్న, బీసన్న, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గిడ్డమ్మ, శ్రావణి నగర కార్యదర్శి భారతి, శైలజ, పావని,ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు,ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శరత్, నగర అధ్యక్ష కార్యదర్శులు అభి, అశోక్ ఈ దీక్షలో కుమార్ రాజా, కృష్ణ ,రవి, లక్ష్మి, అశోక్, శేఖర్, ఏసన్న తదితరులు పాల్గొన్నారు.

పతి అక్షరం ప్రజాపక్షమే

అశోక్ మహిళ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ అశోక్ వర్ధన్ రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

పజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అశోకవర్ధన్‌రెడ్డి

ప్రజాశక్తి దిన పత్రిక బడుగు బలహీన వర్గాలతో పాటు ఉద్యోగ కార్మిక కర్షక వర్గాల పక్షాన అండగా నిలుస్తుందని అశోక మహిళా ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ కె.అశోకవర్ధన్ రెడ్డి అన్నారు. కళాశాల ప్రిన్సిపల్ ఛాంబర్‌లో ప్రజాశక్తి దినపత్రిక ఎడ్యుకేషన్ క్యాలెండర్‌ను రిపోర్టర్ నీలం సత్యనారాయణ, జి.మధు ఆధ్వర్యంలో కళాశాల చైర్మన్ కె. అశోక్‌వర్ధన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అశోకవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యలను ప్రతిబింబించే విధంగా ప్రజాశక్తి దినపత్రిక వార్త కథనాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.నవీన్ అకౌంటెంట్ ధవలేశ్వర్ పాల్గొన్నారు.

సావిత్రి బాయికి ఘననివాళి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా పలు విద్యాసంస్థల్లో ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సావిత్రిబాయి పూలే జీవితాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని పలువురు వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు.

క్లస్టర్ వర్సిటీ పరిధిలో: కర్నూలు బి క్యాంపులోని క్లస్టర్ వర్సిటీ పరిధిలో సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. విసి డివిఆర్ సాయిగోపాల్ , రిజిస్ట్రార్ కట్ట వెంకటేశ్వర్లు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. విసి మాట్లాడుతూ క్లస్టర్ విశ్వవిద్యాలయం కెవిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వసతి గృహానికి సావిత్రిబాయి పూలే పేరు పెడతామని హామీ ఇచ్చారు.క్లస్టర్ విశ్వవిద్యాలయం డిగ్రీ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

క్లస్టర్ యూనివర్సిటీలో నివాళ్లు అర్పిస్తున్న విసి సాయిగోపాల్, అధ్యాపకులు

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో : రాయలసీమ యూనివర్సిటీ సెంట్రల్ లైబ్రరీ ముందు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సావిత్రి భాయి పూలే జయంతిని నిర్వహించారు. వర్సిటీ కన్వీనర్ రామకృష్ణ మాట్లాడుతూ సావిత్రి భాయి పూలే భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు,గొప్ప సంఘసంస్కర్త, గొప్ప రచయిత్రి అని కొనియాడారు. ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ కో-కన్వినర్ మౌలాలి, రాజు, సికిందర్, సాగర్, శివ, నారాయణ, సాయి, జోష్, కుమార్, ప్రవీణ్, భీమేష్, ప్రతాప్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాయలసీమ విశ్వవిద్యాలయంలో సావిత్రిబాయి పూలేకు ఘనవాళులు అర్పిస్తున్న విద్యార్థులు

ఓర్వకల్లు జిల్లా పరిషత్ పాఠశాలలో : ఓర్వకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహించారు. ఎంఇఒ ఓంకార్ యాదవ్, పాఠశాల హెచ్‌ఎంనారాయణరెడ్డి, టిడిపి మండల కన్వీనర్ గోవిందరెడ్డి సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే జీవితాన్ని ప్రతి విద్యార్థిని తెలుసుకోవాలని కోరారు.

మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా సావిత్రిబాయి జయంతి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

తెలంగాణ రాష్ట్రంలో లాగానే ఆంధ్రప్రదేశ్‌లో కూడా సావిత్రీ బాయిపూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించేలా ముఖ్యమంత్రితో చర్చిస్తానని కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు అన్నారు. నగరంలోని బిసి భవన్‌లో బీ.సీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సావిత్రీ బాయి పూలే 195వ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. సావిత్రీ బాయి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఎంపి కేక్ కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ దేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీ బాయి పూలే స్త్రీల విద్యాభివృద్ధికి కషి చేశారన్నారు..నేడు మహిళలు విద్యావంతులుగా ఉన్నతమైన స్థానాల్లో ఉన్నారంటే అందుకు సావిత్రీభాయి పూలే చేసిన పోరాటమేనన్నారు.. లింగవివక్ష, కుల అసమానతలపై ఆమె చేసిన పోరాటం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమన్న ఆయన సావిత్రీ బాయి పూలే ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. బిర్లా గేట్ వద్ద ఉన్న జ్యోతిరావు పూలే విగ్రహం పక్కన సావిత్రీ బాయి పూలే విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తానని ఎంపి నాగరాజు హామీ ఇచ్చారు. ఏపీ స్టేట్ నాయి బ్రాహ్మణ డెవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ పాలకవీటి విజయకుమార్, కురుబ,కురువ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ, కార్పొరేటర్ సత్యనారాయణమ్మ, బిసి సంక్షేమ సంఘం నాయకులు నక్కల మిట్ట శ్రీనివాసులు, న్యాయవాది గోవిందు పాల్గొన్నారు.

ఎంపి బస్తిపాటి నాగరాజుకు కేక్ తినిపిస్తున్న పాలకవీటి విజయకుమార్

జర్నలిస్టులకు కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

కంటి జబ్బులను ప్రాథమిక దశలో గుర్తించాలి

జర్నలిస్టులకు కంటి అద్దాలు పంపిణీ చేసిన డాక్టర్ శంకర్ శర్మ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కంటి సమస్యలను ప్రాథమిక దశలో గుర్తించి చికిత్స పొందితే కంటిచూపు కోల్పోవడం వంటి తీవ్ర సమస్యలు రాకుండా జాగ్రత్త పడవచ్చని సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్‌శర్మ సూచించారు. కర్నూలు నగరంలోని గాయత్రీ ఎస్టేట్లోని శ్రీగురుదత్త పాలిక్లినిక్‌లో గతంలో ఉచిత కంటి వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకున్న జర్నలిస్టులకు, సమాచార శాఖ కు చెందిన కొంతమంది సిబ్బందికి ఉచితంగా కంటి అద్దాలను డాక్టర్ శంకర్‌శర్మ పంపిణీ చేశారు. సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ సర్వేంద్రియానాం నయనం ప్రధానం అనే సూక్తి ఉందని, మనిషి శరీరంలోని అన్ని అవయవాల కంటే కంటి ప్రాధాన్యతను ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలని చెప్పారు. ఇందులో భాగంగానే కంటి జబ్బులను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స పొందాలని సూచించారు. కంటి సమస్యలైన చత్వారం, గ్లోకోమా, క్యాటరాక్ట్, కార్నియా సంబంధిత సమస్యలను వీలైనంత త్వరగా గుర్తించి చికిత్స పొందడం ద్వారా కంటిచూపు కోల్పోకుండా చూసుకోవచ్చని వివరించారు. ఒకసారి కంటిలో ఇన్ఫెక్షన్ మొదలైతే దానిని నిర్లక్ష్యం చేయకుండా తగిన చికిత్స తీసుకోవాలన్నారు. లేదంటే నియంత్రించడం కష్టమని వివరించారు. మనిషి ఈ ప్రపంచాన్ని చూడగలుగుతున్నాడంటే అది కంటి చూపు వల్లేనని తెలిపారు. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని, పరిశుభ్రమైన ఆహారాన్ని తీసుకోవాలని కోరారు. కలుషిత నీరు తాగడం వల్ల, అపరిశుభ్రమైన ఆహారం తీసుకోవడం వల్ల పలు ఆరోగ్యపరమైన సమస్యలు వస్తాయని వివరించారు. కంటి జబ్బులు రాకుండా చూసుకోవాలంటే విటమిన్ ఏ పుష్కలంగా లభించే ఆకుకూరలు, పండ్లు, వంటి వాటిని అధికంగా తీసుకోవాలని కోరారు. తన సామాజిక సేవా కార్యక్రమాలను భవిష్యత్తులో మరిన్ని కొనసాగిస్తానని వెల్లడించారు.

మేమూ ఎస్సీలమే...

ప్రజాశక్తి- గూడూరు : మాదాసి కురువ మదారి కురువ తామూ ఎస్‌సిలమే అంటూ మాదాసి కురువ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిలేటి శుక్రవారం తహశీల్దార్ రామాంజనేయులు కు వినత పత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ జీవో నెంబర్ 31/ 1956న జీవో నెంబర్ ప్రకారంగా మేము కూడా ఎస్‌సిలమే అని కానీ కొందరు కులాలు వారు కురుబ కురుమ లుగా వారిని మార్చాలని తహశీల్దార్‌పై ఒత్తిళ్లు తెస్తున్నారని , ఇండియన్ హిందూ ఎస్‌సిలుగా మాదిగ కురువ అసలైన ఎస్‌సిలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లికార్జున, టైలర్ దస్తగిరి, కురువ వెంకటేష్, మునేష్, రంగన్న, దినేష్, రాజు, శివ లక్ష్మన్న మిన్నెల శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి - ఆదోని

పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్

రేషన్ డీలర్ల రాత పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు సిద్ధం చేయాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఈనెల 5న జరిగే రేషన్ డీలర్ల రాత పరీక్షకు సంబంధించిన కేంద్రాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆదోని డివిజన్‌లో 78 డీలర్ల నియామకం కోసం 512 మంది దరఖాస్తులు చేసుకున్నారని, వీటిలో సరైన పత్రాలు లేనందున 45 దరఖాస్తులను తిరస్కరించినట్లు తెలిపారు. 467 దరఖాస్తులకు హాల్ టికెట్ మంజూరు చేశామన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో హాల్ టికెట్లు ఇస్తారని తెలిపారు. 5న ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పరీక్షకు హాజరయ్యేవారు 9.30 గంటల్లోపు పరీక్ష కేంద్రంలో ఉండాలన్నారు. ఒరిజినల్ హాల్ టికెట్, ఆధార్ కార్డు తీసుకురావాలన్నారు. కేంద్రంలోకి ఎలక్ట్రానిక్ పరికరాలు గడియారం, క్యాలిక్యులేటర్, మొబైల్ ఫోన్స్ అనుమతి లేదన్నారు. రాత పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి 1:5 నిష్పత్తి ప్రకారం ఈనెల 6న ఇంటర్వ్యూ నిర్వహిస్తామని తెలిపారు. పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహశీల్దార్ వలీబాష, ఆర్ఐ ఖాసీం, విఆర్ఒ రాజశేఖర్ గౌడ్ ఉన్నారు.

యుటిఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - కౌతాళం

యుటిఎఫ్ నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్, అధ్యాపక దర్శినిని ఎంఇఒ-2 శోభారాణి, కౌతాళం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇమ్మానుయేల్, ఎరిగేరి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ నాయుడు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. యుటిఎఫ్ డైరీలో ఉపాధ్యాయుల సర్వీసుకు సంబంధించిన అనేక అంశాలు, జిఒలు పొందుపరిచారని తెలిపారు. యుటిఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ... ఈనెల 5, 6, 7, 8న కాకినాడలో జరిగే యుటిఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఓంకార్, జిల్లా కౌన్సిల్ సభ్యులు సుధాకర్, రంగన్న, ఆర్థిక కార్యదర్శి బసవరాజు, మండల నాయకులు వెంకటేశ్వర్లు, శ్రీధర్, మంగరాజు, రంగన్న, రాజేష్, నాగేశ్వరి, విజయలక్ష్మి, విశాలాక్షి పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుతో భూసమస్య పరిష్కారం

- తహశీల్దార్ శివ శంకర్ నాయక్

ప్రజాశక్తి - ఆస్పరి

రైతులతో మాట్లాడుతున్న తహశీల్దార్ శివ శంకర్ నాయక్

రెవెన్యూ సదస్సు ద్వారా రైతు భూ సమస్యలు పరిష్కారం అవుతాయని తహశీల్దార్ శివ శంకర్ నాయక్ తెలిపారు. శుక్రవారం మండలంలోని బనవనూరు గ్రామంలోని సచివాలయంలో ఇన్‌ఛార్జీ విఆర్ఒ బలరాం అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుకు రైతులు అర్జీలతో ఇస్తున్నారని తెలిపారు. సదస్సులో 6 అర్జీలు వచ్చాయని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. దేవదాయ శాఖ జిల్లా అధికారి శ్రీనివాసులు, ఇన్‌ఛార్జీ ఆర్ఐ రంగస్వామి, ఎండల సర్వేయర్ శ్రీనివాసులు, విఆర్ఒ రామాంజినేయులు, సర్పంచి పెద్ది రెడ్డి, ఎంపిటిసి ప్రభావతమ్మ, పంచాయతీ కార్యదర్శి సహారా భాను, టిడిపి నాయకులు హనుమంతు రెడ్డి, సర్వేయర్ విజయ లక్ష్మి, సిబ్బంది రమేష్, రైతులు పాల్గొన్నారు.

104 వాహనం ద్వారా

ప్రజల వద్దకే వైద్య సేవలు

ప్రజాశక్తి - గోనెగండ్ల

104 వాహనం ద్వారా ప్రజల వద్దకే వైద్య సేవలు అందిస్తున్నామని గోనెగండ్ల ప్రాథమిక వైద్యశాల వైద్యాధికారిని డాక్టర్ రంగ రవళి తెలిపారు. శుక్రవారం గోనెగండ్ల మేజర్ పంచాయతీ కార్యాలయం వద్ద 104 వాహనం ద్వారా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి గర్భిణులు, బాలింతలు తరలివచ్చి వైద్య సేవలు పొందారు. ఆస్పత్రికి రాలేని నిస్సహాయ స్థితిలో ఉన్న గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, వికలాంగులకు ఈ సేవలు ఎంతో ఉపయోగకరమని ఆమె తెలిపారు.

విద్యార్థుల రక్షణలో ప్రభుత్వం విఫలం

- డివైఎఫ్ఐ, ఐద్వా, ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

విద్యార్థులకు రక్షణ కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, ఎమ్మిగనూరు మండలం బనవాసి గురుకుల బాలికల కళాశాలలో విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన వారిని, వారికి సహకరించిన వారిని సస్పెండ్ చేసి కఠినంగా శిక్షించాలని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న, ఐద్వా జిల్లా కార్యదర్శి అలివేలమ్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం.రంగప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం ఐద్వా, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బనవాసి బాలికల గురుకుల కళాశాలను సందర్శించారు. అనంతరం సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యాసంస్థల్లో విద్యార్థినులకు రక్షణ కరువవుతోందని, బనవాసి ఏపిఆర్‌జెసి బాలికల కళాశాలలో విద్యార్థులను అసభ్యంగా వేధించిన ప్రతి అధ్యాపకునిపైనా కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన గురువులే రాక్షసుల మారి వారిని లైంగికంగా వేధిస్తుండడం దారుణమని మండిపడ్డారు. బనవాసి గురుకుల బాలికల కళాశాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని, మూడు నెలలకోసారి పేరెంట్స్ మీటింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. పురుష అధ్యాపకులను తీసివేసి, మహిళా ఉపాధ్యాయులను నియమించాలని, ఘటనలో ప్రత్యక్షంగా పరోక్షంగా సంబంధం ఉన్న ప్రతి ఒక్కరినీ విచారించాలని డిమాండ్ చేశారు. ఐద్వా నాయకులు పద్మ, శ్యామల, ఎస్ఎఫ్ఐ నాయకులు రాము, విల్సన్, కరుణాకర్ పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలేకు నివాళులర్పిస్తున్న నాయకులు

మహిళాభ్యున్నతికి సావిత్రిబాయి పూలే కృషి

- యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి బాబు - ఘనంగా సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలు

ప్రజాశక్తి - గోనెగండ్ల

మహిళలు, బాలికల అభ్యున్నతికి జీవితాన్ని అర్పించిన మహనీయులు సావిత్రిబాయి పూలే అని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి బాబు, ఎపి మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ షాహినా పర్వీన్, వైస్ ప్రిన్సిపల్ పద్మావతి, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కరుణాకర్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సాయి ఉదయ్, ఎపిడబ్ల్యుజెఎఫ్ తాలూకా ఉపాధ్యక్షులు దండు ఖాజా తెలిపారు. శుక్రవారం గోనెగండ్లతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో యుటిఎఫ్, ఎస్ఎఫ్ఐ, కెవిపిఎస్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో ఎపి మోడల్ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చిన్న మరివీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, కెవిపిఎస్ ఆధ్వర్యంలో బస్టాండ్ ఆవరణలో సావిత్రిబాయి పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎపి మోడల్ జూనియర్ కళాశాలలో 'సోషల్ మీడియా డ్రగ్స్ ప్రభావం - విద్యార్థుల కర్తవ్యం' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు రంగస్వామి, పవన్ అధ్యక్షతన జరిగిన సదస్సులను ఉద్దేశించి బాబు, సాయి ఉదయ్, కరుణాకర్, షాషీనా పర్వీన్, చిన్నమరివీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వరలత మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో విద్యార్థులు సోషల్ మీడియా డ్రగ్స్‌కు ప్రభావితమై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, చదువును నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. వాటికి దూరంగా ఉండి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని కోరారు. మండల కమిటీ సభ్యులు వినయ్, ఓంకార్, బాబు ప్రసాద్ పాల్గొన్నారు. **ఆదోని** పట్టణంలోని నేషనల్ కళాశాలలో సావిత్రి బాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, నాయకులు శశిధర్, మోహన్, మల్లికార్జున, రాజు, మహేష్ పాల్గొన్నారు. అలాగే నోబుల్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో సావిత్రి బాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కళాశాల కరస్పాండెంట్ సంగటి దేవదానం, ప్రిన్సిపల్ అబ్దుల్ బాషా, అధ్యాపకులు డాక్టర్ సలోమి, డాక్టర్ ఖాలక్, దినకర్, త్యాగరాజు, రాజరంగ, ఎస్ఎఫ్ఐ నాయకులు శీను, స్రవంతి, నిఖిలా, ప్రీతి ఉన్నారు. **ఆలూరు** ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి అధ్యాపకులు మంజుల, రవి కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు ఉమేష్ అధ్యక్షత వహించారు. డివైఎఫ్ఐ మండల కార్యదర్శి మైనా, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి గిరిమూర్తి, ఐద్వా మండల అధ్యక్షులు షేకున్ బీ, డివైఎఫ్ఐ మండల నాయకులు మహేష్, బసవరాజు, ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు బోటయ్య, నీలకంఠ నాయక్, షాషావలీ పాల్గొన్నారు. అలాగే సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా యుటిఎఫ్ మహిళా విభాగం ఆధ్వర్యంలో మెయిన్ స్కూల్‌లో యుటిఎఫ్ మండల కార్యదర్శి రూపలత అధ్యక్షతన సీనియర్ మహిళా ఉపాధ్యాయులు మంజులమ్మ, అప్సర్ షాను శాలువాతో సన్మానించారు. ఎంఇఒ కోమల దేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. **ఆదోని (రూరల్)** మండలం ఇస్వి ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు కుమిదినిదేవి, ఉపాధ్యాయులు జయమ్మ సన్మానించారు. పాఠశాల ఉపాధ్యాయులు గాదిలింగప్ప, జగన్, బాష, శ్యాంసుందర్, వెంకటేష్ పాల్గొన్నారు. **కౌతాళం**లోని ప్రతిభ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో సావిత్రి బాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు సావిత్రిబాయి పూలే గురించి వివరించారు. పాఠశాలలో తమ వంతు కృషిగా బాధ్యతలు నిర్వహించిన మహిళా ఉపాధ్యాయులను పాఠశాల యాజమాన్యం శాలువా, పూలమాలతో సన్మానించింది. పాఠశాల సెక్రటరీ సయ్యద్ మైనుద్దీన్, ప్రధానోపాధ్యాయులు జ్ఞానేశ్వరి, పాఠశాల పర్యవేక్షకులు ఈరన్న, భీమేష్ జయలక్ష్మి, సబీహ, శిరీష, రాజు, విరుపాక్షి పాల్గొన్నారు. **చిప్పగిరి** ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను కళాశాల ప్రిన్సిపల్ వరదరాజులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మహిళ సిబ్బందిని శాలువాతో సన్మానించారు. **హోళగుంద**లోని సీజనల్ హాస్టల్‌లో ఉషోదయ గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. సంస్థ వ్యవస్థాపకులు సిహెచ్.నాగరాజు, కార్యకర్తలు సోహన్, దుర్గయ్య, బుడగ జంగాల నాయకులు రామాంజనేయులు, ధూపం అంబులు, సమ్మతిగేరి నాగరాజు పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** మండలంలోని మాచుమాన్ దొడ్డి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శాంతిరాజు ఆధ్వర్యంలో సావిత్రి బాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఐదో తరగతి విద్యార్థినులు పూలే వేషధారణలో ఆకట్టుకున్నారు. అనంతరం గత నెలలో జరిగిన మెగా పేరెంట్స్ డేలో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థిని తల్లి లతను సన్మానించారు. ఉపాధ్యాయులు ఈరేశరాజు, అపర్ణలత పాల్గొన్నారు.

గోనెగండ్లలో నివాళులర్పిస్తున్న నాయకులు, సిబ్బంది

ఆదోనిలో నివాళులర్పిస్తున్న దేవదానం



ఆదోనిలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సిబ్బంది

ఆలూరులో నివాళులర్పిస్తున్న నాయకులు, సిబ్బంది

కౌతాళం ప్రతిభ హైస్కూల్‌లో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సిబ్బంది

చిప్పగిరిలో...

ఎమ్మిగనూరులో నివాళులర్పిస్తున్న సిబ్బంది

జాబ్‌మేళాలో 29 మంది ఎంపిక

ప్రజాశక్తి - ఆలూరు

ఎపి నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాలో 29 మంది నిరుద్యోగ యువత ఎంపికైనట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వి.రమాదేవి, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ఎల్.ఆనంద్ రాజ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ జాబ్ మేళాలో ఎస్‌బిఐ లైఫ్ ఇన్స్యూరెన్స్, బిఎంఎస్ సెక్యూరిటీస్ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు తెలిపారు. 61 మంది నిరుద్యోగ యువత పాల్గొన్నారని, వీరిలో 29 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు చెప్పారు. స్కిల్ హబ్ కోఆర్డినేటర్ వీరేష్, నాన్ టెక్నికల్ ఆఫీసర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

వైసిపి జిల్లా అధికార ప్రతినిధిగా మల్లికార్జున

ప్రజాశక్తి - చిప్పగిరి

వైసిపి జిల్లా అధికార ప్రతినిధిగా చిప్పగిరి మండలం దేగులపాడు గ్రామానికి చెందిన మాజీ సర్పంచి, సొసైటీ మాజీ ఛైర్మన్ ఉనేబాద్ మల్లికార్జునను ప్రకటించారు. వైసిపి అధిష్టానం అధికారికంగా నియమించడంతో శుక్రవారం ఆయన వైసిపి అధ్యక్షులు వైఎస్.జగన్మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే బుసినే విరుపాక్షికి, పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి గ్రామంలోనూ పార్టీ అభివృద్ధికి శాయశక్తుల కృషి చేస్తామన్నారు. తనపై నమ్మకంతో అధికార ప్రతినిధిగా నియమించడం పట్ల వైసిపి నియోజకవర్గ నాయకులకు, కార్యకర్తలకు అందుబాటులో ఉండి పార్టీ అధిష్టానం ఏ పిలుపు ఇచ్చినా అంకితభావంతో పని చేస్తామన్నారు.

విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్ మృతి

ప్రజాశక్తి - కౌతాళం

కౌతాళం మండలం విద్యుత్ శాఖ లైన్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్ అనారోగ్యంతో మృతి చెందారు. విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది వివరాల మేరకు... లైన్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్ పక్షపాతానికి గురై కేరళలో చికిత్స తీసుకున్నారని తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం కేరళలో గుండెపోటుకు గురై మృతి చెందినట్లు పేర్కొన్నా రు. ఆయన మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి : సిఐటియు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరు మున్సిపాలిటీలోని పారిశుధ్య విభాగంలో అనారోగ్యం, కరోనా వైరస్ బారిన పడిన మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు చేపట్టాలని సిఐటియు మండల అధ్యక్షులు సి.గోవిందు, కార్యదర్శి బోయ రాముడు కోరారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత 5 ఏళ్లుగా దాదాపు 12 మంది కార్మికులు మృతి చెందారని, వీరి జాబితాను కమిషనర్ గంగిరెడ్డికి అందజేశారు. 2019 కంటే ముందు మృతి చెందిన కార్మికుల స్థానంలో కారుణ్య నియామకాలు చేపట్టారని, 2019లో వైసిపి అధికారంలోకి వచ్చాక అప్కాస్ ప్రవేశపెట్టి అన్యాయం చేసిందని తెలిపారు. విధులు చేపడుతూ మరణించిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. స్పందించిన మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి... త్వరలోనే కారుణ్య నియామకాలు చేపడతామని హామీ ఇచ్చారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు నాగరాజు, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలి

- కూటమి నేతలు

ప్రజాశక్తి - ఆలూరు

ఆర్‌డిఒను కలిసిన నాయకులు

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని కూటమి నేతలు వైకుంఠం జ్యోతి, శివప్రసాద్, బొజ్జమ్మ, రామచంద్ర నాయుడు, తెర్నేకల్ వెంకప్ప కోరారు. శుక్రవారం పత్తికొండ ఆర్‌డిఒ భరత్ నాయక్‌ను మర్యాద పూర్వకంగా కలిసి మాట్లాడారు. నియోజకవర్గంలోని భూ సమస్యలను, తాగు నీరు, రోడ్డు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు

- హౌసింగ్ ఇఇ ప్రభాకర్

ప్రజాశక్తి - ఆస్పరి

హౌసింగ్ అధికారులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా హౌసింగ్ ఇఇ ప్రభాకర్ హెచ్చరించారు. శుక్రవారం ఆస్పరిలోని హౌసింగ్ కార్యాలయాన్ని సందర్శించారు. హౌసింగ్ కార్యాలయంలోని వర్క్ ఇన్‌స్పెక్టర్ హుస్సేన్ బాష ఒక్కడే ఉండడంతో ఎఇ అంజలి, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు విధులకు రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇక్కడి అధికారులు విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని తమకు సమాచారం అందడంతో ఆస్పరి హౌసింగ్ కార్యాలయానికి వచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన ఇళ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యాలయానికి వచ్చిన లబ్ధిదారుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా సమాధానం చెప్పి పంపాలని సూచించారు. హౌసింగ్ బిల్లుల విషయంలో అక్రమాలకు పాల్పడకుండా అర్హులైన లబ్ధిదారులకు బిల్లులు పెట్టాలన్నారు. అవినీతికి పాల్పడ్డారని సమాచారం వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉపాధ్యాయుల మానవత్వం

ప్రజాశక్తి - మంత్రాలయం

ఆర్థికసాయం అందజేస్తున్న ఉపాధ్యాయులు

మండలంలోని రచ్చుమర్రి గ్రామానికి చెందిన ఎంపియుపి పాఠశాల ఉపాధ్యాయులు ఒక కుటుంబానికి రూ.11 వేల ఆర్థిక సహాయం అందించి మానవత్వం చాటుకున్నారు. మండలంలోని రచ్చుమర్రి గ్రామానికి చెందిన మజ్జిగ నాగేంద్ర రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నేపథ్యంలో శుక్రవారం ఆయన భార్య నాగలక్ష్మికి ఇంటికి వెళ్లి పరామర్శించి సహాయం అందించారు. మజ్జిగ నాగేంద్ర గత డిసెంబర్ 22న మాలపల్లి నుంచి రచ్చుమర్రి గ్రామానికి తన ద్విచక్ర వాహనంపై వస్తుండగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మృతుని నలుగురు పిల్లలు మజ్జిగ రాజు, మజ్జిగ నందిని, మజ్జిగ రాజేశ్వరి, మజ్జిగ శివకుమార్‌లు ఎంపియుపి పాఠశాలలో చదువుకుంటున్నారు. ప్రధానోపాధ్యాయులు రత్నకుమారి, పాఠశాల ఉపాధ్యాయులు శ్రీదేవి, శ్యామలత, వెంకటస్వామి, రాంప్రసాద్, శ్రీనివాసులు, ఇబ్రహీం, హనుమంతు, ఈరన్న పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు రావూస్ సొంతం

- డిగ్రీ రెండు, నాలుగో సెమిస్టర్ ఫలితాల్లో జయభేరి
- టౌన్ టాపర్లుగా రావూస్ విద్యార్థులు
- కళాశాల సిఇఒ తిరుమలరెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పరీక్షలు ఏవైనా ఉత్తమ ఫలితాలు రావూస్ సొంతమని రావూస్ డిగ్రీ కళాశాల సిఇఒ తిరుమలరెడ్డి, సిఒఒ సుజనా రెడ్డి తెలిపారు. ఇటీవల రాయలసీమ యూనివర్సిటీ విడుదల చేసిన డిగ్రీ సెకండ్ సెమిస్టర్ హానర్స్, ఫోర్త్ సెమిస్టర్ ఫలితాల్లో పట్టణంలోని రావూస్ డిగ్రీ కళాశాల జయభేరి మోగించింది. ఎమ్మిగనూరు టౌన్ టాపర్లుగా విద్యార్థులు ప్రతిభ చాటారు. సెమిస్టర్ ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను శుక్రవారం రావూస్ యాజమాన్యం, అధ్యాపకులు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. డిగ్రీ ఫోర్త్ సెమిస్టర్‌లో ఎంఎస్‌సిఎస్ గ్రూపులో కె.దివ్య శ్రావణి 9.60, ఎ.అఖిల 9.41, కె.శ్రేయ 9.12, ఎంపిసిఎస్‌లో ఎస్.ఫైరోజా 9.08, టి.దివ్య 9.0, బిజడ్‌సిలో అఖిల 8.85, తస్లీమా 8.82, అరుణ 8.22, బికాంలో కె.సహిద 8.22, కె.రాధ 8.12, యుఎం.జ్యోతి 7.96, బిఎలో బి.జ్యోతి 7.60, ఈ.పవిత్ర 7.31, చంద్రిక 7.29, బిబిఎలో బి.మేఘన 7.69 సాధించారని తెలిపారు. సెకండ్ సెమిస్టర్ ఫలితాల్లో బిఎస్‌సి హానర్స్ స్టాటిస్టిక్స్ గ్రూపులో బి.సుకన్య 8.65, జికె.స్వప్న 8.27, బిఎస్‌సి హానర్స్ కంప్యూటర్స్‌లో ఎస్.ఆఫ్రిన్ బాను 8.15, జి.కైఫ్ 8.09, కె.రేష్మ 8.03, బిఎస్‌సి హానర్స్ ఫిజిక్స్‌లో బి.మానస 8.02, బిఎస్‌సి హానర్స్ మ్యాథమేటిక్స్‌లో ఎన్.థైసిన్ 7.89, బిఎస్‌సి హానర్స్ బోటనీలో ఐషా సిద్ధిక 8.85, నస్రీన్ బేగం 8.57, టి.ఉష 8.49, బిఎస్‌సి హానర్స్ జువాలజీలో మధుమతి 8.71, పవనశ్రీ 8.57, ఎస్.సతీష్, 8.39 బికాం హానర్స్‌లో బి.నిహర్షిత 8.43, బి.ఉపేంద్ర 8.08, ఎ.ఫయాజ్ 7.69, బిఎ హానర్స్ పొలిటికల్ సైన్స్‌లో ఎస్.ఉమేహనీ 8.05, సి.రాజేశ్వరి 7.69, మహ్మద్ జహీద్ 7.58, బిఎ హానర్స్ తెలుగులో కె.ముంతాజ్ 8.08, టి.దివాకర్ నాయుడు 7.96, యు.లక్ష్మి 7.6, బిఎ హానర్స్ హిస్టరీలో ఎస్.అయిషా 7.50, ఎ.సంపత్ ప్రియ 7.05, పి.కృపావతి 6.81 జిపిఎలతో టౌన్ టాపర్లుగా, గ్రూపు టాపర్లుగా నిలిచారని చెప్పారు. సెకండ్, ఫోర్త్ సెమిస్టర్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల సిఇఒ తిరుమలరెడ్డి, సిఒఒ సుజనా రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ ఇర్ఫాన్, కళాశాల నోడల్ ఆఫీసర్ శ్రుతిప్రియా, సీనియర్ అధ్యాపకులు వెంకటేష్, గోరంట్ల, రామకృష్ణ, విజయ్ కుమార్, నూర్ బాషా, విజయరాజ్, పాల్ రాజ్, వీరేష్, మనో వెంకట్, నందిని, అన్నపూర్ణ, సంధ్య, వీరేశ్వరి, రాజేశ్వరి, సంపత్, ధనుంజయ, గోవిందు ప్రత్యేకంగా అభినందించారు.

ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో రావూస్ యాజమాన్యం, అధ్యాపకులు

సన్మానం పొందుతున్న ఈరన్న

30 ఏళ్ల సేవకు పురస్కారం

ప్రజాశక్తి - ఆదోని

ప్రజాశక్తి దినపత్రిక అభివృద్ధికి నిరంతరం పాటుపడుతున్న ఆదోనికి చెందిన ఏజెంట్ ఈరన్నకు పురస్కారం దక్కింది. గత డిసెంబర్ 29 నుంచి 30 వరకు ఎమ్మిగనూరులోని మాచాని సోమప్ప మెమోరియల్ హాలులో జరిగిన సిపిఎం జిల్లా 23వ మహాసభల సందర్భంగా పూలమాల, శాలువాతో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు సన్మానం చేశారు. శుక్రవారం ఆదోనిలో ఈరన్న మాట్లాడారు. డివైఎఫ్ఐ సభ్యునిగా తన ప్రస్థానం మొదలైందన్నారు. సిఐటియు నాయకునిగా కీలకంగా కొనసాగుతూ పరోక్షంగా సిపిఎంకు సహకారం అందించామని తెలిపారు. 30 ఏళ్లుగా ప్రజాశక్తి దినపత్రిక ఏజెంట్‌గా ఆదోనిలో సేవలు అందిస్తున్నామని చెప్పారు. తన సేవలను గుర్తించి ప్రజాశక్తి ఎడిషన్ వార్షికోత్సవం సందర్భంగా జనరల్ మేనేజర్ నరసింహ, న్యూస్ ఇన్‌ఛార్జీ చంద్రయ్య చేతుల మీదుగా తనను సన్మానం చేశారని గుర్తు చేశారు. తన సేవలను గుర్తించి సిపిఎం మహాసభల సందర్భంగా ఎందరో మహనీయుల సమక్షంలో సన్మానం పొందడం ఆనందంగా ఉందని తెలిపారు. ప్రజాశక్తి దినపత్రికకు ఏజెంట్‌గా నిరంతరం పని చేస్తూ అభివృద్ధికి సహకరిస్తానని చెప్పారు.

మున్సిపల్ ఛైర్మన్ పదవిని ముస్లింలకు కేటాయించాలి : జెఎసి

ప్రజాశక్తి - ఆదోని

రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ఆదోని మున్సిపల్ ఛైర్మన్ పదవిని ముస్లిం, మైనార్టీ వర్గానికి రిజర్వ్ చేయాలని ఆదోని ముస్లిం జెఎసి నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ముస్లిం జెఎసి కన్వీనర్ నూర్ అహ్మద్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో తీర్మానం చేశారు. ఈ సందర్భంగా జెఎసి కన్వీనర్ నూర్ అహ్మద్ మాట్లాడారు. మైనారిటీలకు అత్యధికంగా సేవ చేయడానికి మైనారిటీల జీవితాల్లో మార్పు తేవడానికి దోహదపడే ఆదోని మున్సిపల్ ఛైర్మన్ పదవిని మైనారిటీలకు రిజర్వ్ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. మున్సిపాలిటీ పరిధిలో దాదాపు 50 శాతం ప్రజలు ముస్లింలేనని, ఇంతవరకు మున్సిపల్ ఛైర్మన్‌గా ఒక్క ముస్లిం లేకపోవడం బాధాకరమన్నారు. ఈ లోటును ప్రస్తుత కూటమి ప్రభుత్వం భర్తీ చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జెఎసి కోకన్వీనర్ ఎమ్‌డి.నూర్, ఎంహెచ్‌పిఎస్ నాయకులు సయ్యద్ వసీమ్ సాహెబ్ ఖాద్రీ, ఎంఐఎం నాయకులు జునైద్, నాసిర్, హెచ్‌ఆర్‌ఎఫ్ నాయకులు ఖాదర్ బాషా, ఎస్‌డిపిఐ నాయకులు నాసిర్, సద్దాం హుస్సేన్, న్యాయవాది మహ్మద్ వసీమ్ ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

లాంగ్వేజ్ స్కూల్ అసిస్టెంట్ పోస్టులు భర్తీ చేయాలి : ఎంటిఎఫ్

ప్రజాశక్తి - ఆదోని

లాంగ్వేజ్ స్కూల్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయాలని ఎంటిఎఫ్ అధ్యక్షులు అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి జంగం బసవరాజు కోరారు. శుక్రవారం నెహ్రూ మెమోరియల్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. భాషేతర పాఠశాల సహాయకుల పోస్టుల ప్రమోషన్ ప్రక్రియను జిల్లా విద్యాశాఖ అధికారులు పూర్తి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో మున్సిపల్ ఉపాధ్యాయులకు సంబంధించి ప్రమోషన్ ప్రక్రియలో భాష పాఠశాల సహాయకులు పోస్టులను నోటిఫై చేసి, ప్రమోషన్ చేపట్టారని చెప్పారు. కేవలం జిల్లాలో మాత్రం మున్సిపల్ యూనిట్‌కు సంబంధించి ఈ పోస్టులను ఇప్పటికీ నోటిఫై చేయకపోవడంతో అర్హత గల మున్సిపల్ ఉపాధ్యాయులు తీవ్ర నిరాశకు గురవుతున్నారని తెలిపారు. జిల్లాలోని మున్సిపల్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోందని, విద్యార్థుల సంఖ్యకనుగుణంగా పోస్టులు మంజూరు చేసి భర్తీ చేయాలని కోరారు. ఎంటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్, నాయకులు దస్తగిరి, మద్దయ్య, నూర్ ఉల్ హక్, చంద్రమౌళి, బడుగు బసవరాజు, కల్యాణి, శ్యామల, శ్వేతా బాయి, లలితమ్మ, ప్రకాశమ్మ, రాధ, అపర్ణ, సునంద, సుకన్య, సులక్షణ, సువేదమ్మ, కోమలి, పద్మాబాయి, స్వాతి రెడ్డి, హర్ష శిల్ప, నాగరాజు, ముంతాజ్ బేగం, పరిమళ, శకుంతలమ్మ ఉన్నారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి

- తండ్రి మృతితో అనాథలుగా మారిన పిల్లలు
- పాండవగల్ గ్రామంలో విషాదఛాయలు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

రోధిస్తున్న చిన్నారులు, కుటుంబ సభ్యులు

హఠాత్తుగా గుండె నొప్పి వచ్చి, ఉపాధి పనులు చేస్తున్న కూలీ మృతి చెందిన సంఘటన శుక్రవారం మండలంలోని పాండవగల్ గ్రామంలో చోటు చేసుకుంది. ఉపాధి కూలీ వై.ఆంజనేయులు (42) గ్రామంలో ఉపాధి హామీ పనులకు వెళ్లారు. ఎప్పటిలాగే కూలీలతో కలిసి మట్టి తీస్తుండగా ఒక్కసారిగా గుండె నొప్పి వచ్చింది. తోటి ఉపాధి కూలీలు శివరాములు, ఆంజనేయులు, అనంతయ్య ఆదోని ప్రభుత్వాస్పత్రికి తీసుకురాగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. 6 సంవత్సరాల క్రితం భార్య మహాదేవి మృతి చెందడంతో నలుగురు పిల్లలను పోషిస్తూ తనకున్న అర ఎకరా భూమితో, ఉపాధి కూలితో జీవనం కొనసాగిస్తూ వచ్చారు. ఆంజనేయులు, మహాదేవి దంపతులకు నలుగురు సంతానం. మైత్రిని సంవత్సరం క్రితం ఓబులాపురం గ్రామానికి ఇచ్చి వివాహం చేశారు. మల్లమ్మ హోళగుంద మండలంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. తాయమ్మ, శివ ఉన్నారు. తండ్రి మృతి చెందడంతో పిల్లలు అనాథలుగా మారారు. పాండవగల్ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతి విషయం తెలుసుకున్న గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ ఈరమ్మ, ఎంపిడిఒ రాజేంద్రప్రసాద్ ఆదోని ప్రభుత్వాస్పత్రికి వచ్చి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వం మృతుని కుటుంబానికి రూ.10 లక్షలు అందించి ఆదుకోవాలని వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న, మండల కార్యదర్శి రామాంజనేయులు డిమాండ్ చేశారు.

అభివృద్ధిలో యాజమాన్య కమిటీ కీలకం

- డిప్యూటీ డిఇఒ వెంకటరమణారెడ్డి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

విద్యాభివృద్ధికి పాఠశాల యాజమాన్య కమిటీ కీలకమని డిప్యూటీ డిఇఒ వెంకటరమణా రెడ్డి, ఎంఇఒ శ్రీనివాసులు తెలిపారు. గత రెండు రోజులుగా స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన మేనేజ్‌మెంట్ శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. వారు మాట్లాడుతూ... విద్యార్థుల హాజరుశాతం, ప్రభుత్వ పథకాలు, మధ్యాహ్న భోజన పథకం అమలు, మురుగుదొడ్ల వినియోగం వంటి అంశాలను ఎస్‌ఎంసి సభ్యులు పర్యవేక్షించాలని సూచించారు. ఎస్‌ఆర్‌పిలు సురేంద్రబాబు, మల్లికార్జున, సిఆర్‌పి మల్లికార్జున పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఇఒ శ్రీనివాసులు

బడుగుల చదువులమ్మకు అవమానం

-సంక్షేమ భవన్లో సావిత్రిబాయి పూలే విగ్రహానికి బూజు
-జయంతి రోజునా పట్టించుకోని అధికారులు
-అధికారుల తీరుపై పలువురి మండిపాటు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

బడుగు బలహీన దళిత వర్గాలకు చదువు నేర్పిన చదువులమ్మ సావిత్రిబాయి పూలే జయంతి రోజున కూడా ఆమెకు అవమానం తప్పలేదు. దేశవ్యాప్తంగా ఆమె 194వ జయంతిని అంగరంగ వైభవంగా ప్రజలు నివాళులర్పిస్తూ ఆమె సేవలను గుర్తు చేసుకొని గౌరవిస్తున్న వేళ సాక్షాత్తు జిల్లా సంక్షేమ భవన్ వేదికగా ఆమెకు విగ్రహానికి తీరని అవమానం ఎదురయింది. అంబేద్కర్ భవన్లో ఉంచిన సావిత్రిబాయి పూలే విగ్రహమే అందుకు నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తోంది. ఆ విగ్రహానికి పట్టిన బూజును, పేరుకుపోయిన దుమ్మును కనీసం దులపకపోవడం ఇక్కడి అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. సంక్షేమ భవన్లో బీసీ సంక్షేమ శాఖ, బీసీ కార్పొరేషన్, ఎస్సీ కార్పొరేషన్, సాంఘిక సంక్షేమ శాఖ, హౌసింగ్ శాఖకు సంబంధించిన కార్యాలయాలు ఉన్నాయి. నిత్యం ఆ విగ్రహం ముందే అధికారులు, సిబ్బంది రాకపోగాలు సాగిస్తున్నా... విగ్రహం శుభ్రం చేసే పనిని ఏ ఒక్కరూ పట్టించుకోకపోవడం గమనార్హం. కనీసం ఆమె జయంతి రోజున కూడా విగ్రహాన్ని శుభ్రం చేసి గౌరవించాలన్న కనీస స్పృహ ఇక్కడి అధికారులకు లేకపోవడం పలు విమర్శలకు దారితీస్తోంది. మహనీయుల జయంతులు, వర్ధంతుల నాడు లక్షల్లో ఖర్చుపెట్టి ఘనంగా నిర్వహిస్తున్నామనే ప్రభుత్వ అధికారులకు తమ ఆఫీసులోనే ఉన్న సావిత్రిబాయి పూలే విగ్రహం పరిశుభ్రతను పట్టించుకోకపోవడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

సావిత్రిబాయికి, మన్మోహన్ సింగ్‌కు ఘన నివాళులు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

సావిత్రిబాయి పూలే గొప్ప సంఘసంస్కర్త మహిళా అభివృద్ధికి ఆమె సేవలు మరువలేనివని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. శుక్రవారం సావిత్రిబాయిపూలే జయంతిని పురస్కరించుకుని కల్లూరు ఎంపిడిఒ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి ఎమ్మెల్యే , ఎంపిడిఒ జీఎన్ఎస్ రెడ్డి, పాటు ప్రజాప్రతినిధులు ,అధికారులు పూల మాలవేసి నివాళులు అర్పించారు. ఇటీవల మృతిచెందిన మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల అభివృద్ధికి చదువు ముఖ్యమని అన్నారు. మహిళా సమస్యలపై సావిత్రిబాయి పూలే ఎన్నో పోరాటాలు, సంస్కరణలు చేశారన్నారు ప్రధానమంత్రిగా మన్మోహన్ సింగ్ దేశానికి మంచి సేవలు అందించారని అన్నారు. మండల ఎంపిటిసిలు, సర్పంచులు మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముజఫర్‌నగర్ లో కర్నూలు కార్పొరేషన్ పరిధి ముజఫర్ నగర్ టిసి లక్ష్మమ్మ కుట్టు శిక్షణ కేంద్రంలో మహిళలు సావిత్రిబాయి పూలే 194 వ జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె సుధాకరప్ప, మహిళా సంఘం నాయకురాలు ఎస్ శారదమ్మ, రమణమ్మ మాట్లా డుతూ సావిత్రిబాయి పూలే అభ్యుదయ భావాలు ఉన్న జ్యోతిరావు పూలేను వివాహం చేసుకొని ఇద్దరు కలిసి సాంఘిక సంస్కర ణోద్యమంలో నూతన వరువడిని సృష్టించారని తెలిపారు.ఇంట్లోనే విద్యాభ్యాసం ప్రారంభించారని, 1847 లో ఉపాధ్యాయురాలిగా శిక్షణ పొందారని ,1848 భర్త జ్యోతిరావు పూలే తో కలిసి పూణేలో అణచివేత గురవుతున్న బాలికల కోసం పాఠశాలను ప్రారంభించారన్నారు. ఆమె పాఠశాలకు వెళుతున్న మార్గ మధ్యంలో చాందసవాదులు ఆపి అసభ్య కరమైన పదజాలంతో దూషించి రాళ్లతో దాడి చేసి పేడ నీళ్ల చల్లి అవమానించినా ఏమాత్రం జంకకుండా పాఠశాలకు వెళ్లి విద్యను బోధించేదని తెలిపారు. బాల్య వివాహాలను అరికట్టారని చిన్న వయసులో భర్తను కోల్పోయిన వాళ్ల వితంతువులుగా జీవితాన్ని గడపాల్సి వస్తుందని వారికి వితంతు పునర్వివాహాల్ని దగ్గరుండి చేయించారని తెలిపారు. 1852లో మహిళా హక్కులను మహిళలకు తెలియజేసేందుకు సామాజిక చైతన్యం రూపొందించేందుకు మహిళా సేవ సంస్థల్ని ఏర్పాటు చేశారని తెలిపారు. సామాజిక రుగ్మతలకు వ్యతిరేకంగా నిలబడిన వీర వనిత సావిత్రిబాయి పూలే అన్నారు. ఈ కార్యక్రమంలో సుధారాణి, విజయ కుమారి, పుష్ప, సురేఖ, అస్మా, అరీఫా, సలోని, రఫియా తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే, మన్మోహన్ సింగ్‌కు నివాళిఅర్పిస్తున్న గౌరుచరిత, తదితరులు

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-సి బెళగల్

పజాశక్తి 2025 కు సంబంధించిన క్యాలెండర్‌ను సిఐటియు ప్రాంతీయు నాయకులు మోహన్ శుక్రవారం ఆవిష్కరణ చేశారు. మండల విలేకరి వెంకట్ అధ్యక్షతన ఈ ఆవిష్కరణ చేపట్టగా ఇందులో సిఐటియు మండల అధ్యక్షులు ఇబ్రహీం, సిపిఎం మండల నాయకులు ఖాజా, స్వచ్ఛ కార్మిక సంఘం మండల నాయకులు రోగెన్న , కార్యకర్తలు నాగరాజు, సోము, జైలు, తదితరులు పాల్గొన్నారు. మోహన్ మాట్లాడుతూ ప్రతి అక్షరం ప్రజల పక్షం నినాదంలో నిరంతరం ప్రజలను వెలికి తీయడంలో ప్రజాశక్తి ముందుందని అన్నారు.

ప్రజాశక్తి క్యాలెండర్‌ను ప్రారంభిస్తున్న మోహన్ తదితర నాయకులు

సమన్వయంతో సమస్యలు పరిష్కారం

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కూటమి ప్రభుత్వానికి సంక్షేమం అభివృద్ధి రెండు కళ్ళు అని అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో ప్రజా సమస్యలను పరిష్కారమవుతాయని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి అన్నారు. శుక్రవారం కల్లూరు మండల సర్వ సభ్య సమావేశం ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి బోయ శారద అధ్యక్షతన ఎంపిడిఒ జి నాగ శేషాచల రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. గౌరు చరితారెడ్డి ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. అధికారులు గ్రామాలలో నిర్వహించే సదస్సుల సమాచారాన్ని సర్పంచులకు ఎంపిటిసిలకు అందించడం లేదని దీనివల్ల ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన లేకుండా పోయిందని పలువురు ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తెచ్చారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారుల వద్దకు ప్రజలను తీసుకెళ్లితే స్పందించడం లేదని వాపోయారు. అధికారులకు ప్రజాప్రతినిధుల మధ్య సంబంధం కొరవడిందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌరుచరిత మాట్లాడుతూ సంక్షేమం అభివృద్ధి రెండు కళ్లుగా కూటమి ప్రభుత్వం ముందుకెళుతుందని అన్నారు. ప్రజలందరి సహకారంతో అభివృద్ధిలో ముందుకు వెళ్తున్నామని అన్నారు. గోకులపాడు జడ్‌పిహెచ్ఎస్ స్కూల్లో సోషల్ టీచర్ లేకపోవడంతో 10వ తరగతి విద్యార్థులు పాఠ్యాంశాలలో వెనకబడతారని తమ దృష్టికి ఎంఇఒ తీసుకుని వస్తే వెంటనే లక్ష్మీపురం జడ్‌పిహెచ్ఎస్‌లో సరప్లస్‌గా ఉన్న ఒక ఉపాధ్యాయుని గుర్తించి డిప్యూటేషన్‌పై గోకులపాడు పాఠశాలకు బదిలీ చేయించి విద్యార్థులకు విద్యాబోధన కుంటు పడకుండా చూసామని తెలిపారు. ఇలా ప్రతి అంశంలో అధికారులు ప్రజా ప్రతినిధుల సహకారంతో, సమన్వయంతో సమస్యలు పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ కె. ఆంజనేయులు, మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, ఎంపిటిసిలు కె మేకల శేషన్న, కె.మునుస్వామి, నక్క సోమన్న, కె.నాగేశ్వరరావు, సర్పంచులు బి.మద్దిలేటి, బి.రవి, బి ఘనమద్దిలేటి, భూపాల్ రెడ్డి, సహారాబీ, లక్ష్మన్న, జి.రాముడు మండల స్థాయి అధికారులు, ఎంఇఒ వనజ కుమారి, ఇఒఆర్‌డి నగేష్,వ్యవసాయ అధికారి శ్రీనివాసులు రెడ్డి, ఎపిఒ మద్దేశ్వరమ్మ, ఎపిఎం పుష్ప, పశుసంవర్ధక శాఖ వైద్యులు పిహెచ్‌సి వైద్యులు ఐసిడిఎస్ సూపర్వైజర్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి

సుబ్బరాయశర్మ కళా రంగ సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్

నాటకం, టివి, సినిమా రంగాలకు దాదాపుగా 50 సంవత్సరాలు సేవలు అందించిన సుబ్బరాయ శర్మ కృషి ప్రశంసనీయమని రాజ్యసభ మాజీ సభ్యులు టిజి. వెంకటేష్ అన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక టీజీవి కళాక్షేత్రంలో నాటకోత్సవాల ముగింపు సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అంతకుముందు జ్యోతి ప్రజ్వలన చేసి మహతి పోతరాజు ప్రార్థనతో సహా కార్యక్రమం ప్రారంభమైంది. నటులు నిర్మాత పారిశ్రామికవేత్త బివి రెడ్డి మాట్లాడుతూ టీజీవి కళాక్షేత్రం మహతి క్రియేషన్స్ సంయుక్త నిర్వహణలో మూడు రోజులపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శించారు. కళా రంగం బతికి ఉన్నప్పుడే మన సంస్కృతి జీవిస్తుందన్నారు. అడిషనల్ ఎస్‌పి హుస్సేన్ పీరా మాట్లాడుతూ సాంఘిక నాటకాలు మన జీవితానికి అద్దం వంటివని, సమస్యలను ప్రేక్షకులకు ముందు తీసుకు వెళ్ళడానికి ఒక మంచి సాధనం అన్నారు. సుబ్బరాయ శర్మ స్వాగతం పలుకుతూ కర్నూలులో నాటకాలకు మంచి ఆదరణ ఉందన్నారు. కర్నూలుతో ఉన్న అనుబంధంతో ఈ సంవత్సరం ఈ కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. అదేవిధంగా ఈనాటి ఆత్మీయ సన్మాన గ్రహీత డాక్టర్ గుర్రాల రవికృష్ణను అతిథులు సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్యరంగంతోపాటు కళారంగాన్ని సమ స్థాయిలో ముందుకు తీసుకు వెళుతున్నట్లు తెలిపారు. కళారాధన సంస్థ ద్వారా నంద్యాలలో సాంఘిక నాటకాలకు జీవం పోస్తున్నట్లు తెలిపారు. సుబ్బరాయ శర్మ తనకు చేసిన సత్కారాన్ని మరచిపోలేనని అన్నారు. టీజీవి కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య స్వాగతం పలుకుతూ మూడు రోజులపాటు కన్నుల పండుగగా పోటీలు సాగాయన్నారు. అనంతరం కళాకారులు ఇటీవల రోగగ్రస్తులైన శామ్యూల్ నంది అవార్డు గ్రహీతకు వైద్య సహాయ నిమిత్తం కళాక్షేత్రం తరపున రూ.30000 ఆర్థిక సహాయం ప్రకటించారు. అదేవిధంగా మందులు ఇతర వైద్య సహాయం అవసరం ఉంటే అందిస్తానని తెలిపారు. పోటీల సందర్భంగా సరస్వతమ్మ సర్వోత్తమ రెడ్డి కళాకారులకు మహతి క్రియేషన్స్ రూ.5000 రూపాయల ఆర్థిక సహాయాన్ని సినీనటులు సుబ్బరాయ శర్మ అందించారు. అనంతరం మహతి క్రియేషన్స్ సుబ్బరాయ శర్మ దర్శకత్వంలో ఉక్కు సంకెళ్లు నాటకాన్ని ప్రదర్శించారు.

సుబ్బరాయశర్మను సన్మానిస్తున్న టిజి.వెంకటేష్ తదితరులు

ఘనంగా సావిత్రి బాయి పూలె జయంతి

ప్రజాశక్తి - కోడుమూరు రూరల్

శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచి భాగ్యరత్న ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలె జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా సర్పంచి భాగ్యరత్న, ఆంధ్రయ్య దంపతులు పూలవేసి, కొబ్బరికాయ కొట్టి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సర్పంచి భాగ్యరత్న మాట్లాడుతూ సావిత్రి బాయి పూలె మొదటి మహిళా అధ్యాపకురాలు, సంఘసంసకర్త, రచయిత్రి, ఆమె నిమ్నవర్గాల సభ్యనతికి కృషి చేసిన జ్యోతి రావు పూలె భార్య అని అన్నారు. కులమత భేదాలకు అతీతంగా ప్రేమించిన ప్రేమస్వరూపి ఆమె అని కొనియాడారు.ఆంధ్రయ్య, శ్రీకాంత్ మాట్లాడుతూ ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్య పడుతుందని నమ్మిన ఆమె తన భర్తతో కలసి 1848 మొట్టమొదటి సారిగా బాలికల పాఠశాల ప్రారంభించిన ఘనత సావిత్రి బాయి పూలేకు దక్కిందన్నారు. శానిటరి ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మి దేవి, బిల్ కలెక్టర్ శ్రీనివాసులు, మేస్త్రి వెంకటేష్, వాటర్ వర్కర్స్ అంజాద్, శేఖర్, శీను, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న విసి ఎన్‌టికె నాయక్

ఆర్ యు విద్యార్థులు స్వచ్ఛత కార్యక్రమం

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం రైల్వేస్టేషన్లో విద్యార్థులు స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విసి ఎన్‌టికె నాయక్ పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తప్పనిసరిగా సామాజిక బాధ్యతను మరవరాదని పేర్కొన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యకరమైన వాతావరణం నెలకొల్పడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ విజయ్ కుమార్ నాయుడు, రైల్వేస్టేషన్ మేనేజర్ ఎం శేష పని హెల్త్ ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్, రైల్వే ఇన్‌స్పెక్టర్ రామ్మోహన్ వర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రామాపురంలో చనిపోయిన గొర్రెలు

49 గొర్రెల మృత్యువాత

ప్రజాశక్తి - కోడుమూరు రూరల్

కోడుమూరు మండలం రామాపురం గ్రామంలో శుక్రవారం 49 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. దీంతో బాధిత రైతులు లబోదిబోమంటున్నారు. బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం రామాపురం గ్రామానికి చెందిన రైతు మధు గొర్రెలు పెంచుకుంటూ జీవనాధారం సాగిస్తున్నారు. శుక్రవారం ఓటుకుంట వంకను గొర్రెల మంద దాటే క్రమంలో ఒక్కసారిగా గొర్రెల గుంపు అక్కడికి చేరుకోవడంతో తొక్కిసలాటలో 49 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. దీంతో కాపరికి రూ.8 లక్షల ఆస్తి నష్టం జరిగింది. ఈ గొర్రెల మందలో సుమారు 2000 వరకు గొర్రెలు ఉన్నట్టు కాపరులు తెలిపారు.

కంది కట్ట మిషన్లో పడి మహిళ దుర్మరణం

ప్రజాశక్తి తుగ్గలి

తుగ్గలి మండలంలోనిరామలింగయ్య పల్లె గ్రామంలో శుక్రవారం సాయంత్రం కంది కట్టి మిషన్‌లో ప్రమాదవశాత్తు అనంతమ్మ (40) పడి దుర్మరణం చెందారు. రామలింగయ్య పల్లె గ్రామానికి చెందిన మాధవయ్య రైతు పొలాన్ని కౌలుకు తీసుకుని సాగు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. కౌలు పొలంలో సాగు చేసిన కంది పంట కోతకు రావడంతో ఆ పంటను కోసి కంది కట్ట ను మిషన్‌లో వేసే సమయంలో రైతు మాధవయ్య భార్య అనంతమ్మ ప్రమాదవశాత్తు మిషన్ లోకి పడి మతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ జడ్‌పి చైర్మన్ బత్తిన వెంకటరాముడు, మాజీ ఎంపిపి కొమ్ము వెంకటేష్, సర్పంచి సలహాదారుడు వెంకటపతి, తదితరులు మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రమాదవశాత్తు మహిళ మృతి చెందడం చాలా బాధాకరమని, ఆ కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. జొన్నగిరి ఎస్ఐ ఆర్ .జయ శేఖర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కర్నూలుకు చేరుకున్న యుటిఎఫ్ పతాకజాత

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర పతాకజాత శుక్రవారం రాత్రి అనంతపురం నుండి కర్నూలుకు చేరుకుంది. కర్నూలులోని కలెక్టరేట్ కార్యాలయం సమీపంలో గాంధీ విగ్రహం వద్ద పతాక జాతాకు యుటిఎఫ్ జిల్లా నాయకత్వం ఘనంగా స్వాగతం పలికారు. ఈ జాతాకు యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె. సురేష్ కుమార్ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో యుటిఎఫ్ మహాసభలు జరిగిన ప్రాంతాల నుండి ఈ పతాకజాతా పర్యటిస్తుందన్నారు. రాష్ట్రంలో మూడు ప్రాంతాల నుండి పతాకజాతా కొనసాగుతుందన్నారు. ఈనెల 5న కాకినాడకు అన్ని జాతాలు చేరుకుంటాయని పేర్కొన్నారు. కాకినాడలో జరిగే రాష్ట్ర మహాసభలకు పెద్ద ఎత్తున యుటిఎఫ్ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రవికుమార్, నవీన్ పాటి, జిల్లా సహాధ్యక్షుడు హేమంత్ కుమార్, జిల్లా కార్యదర్శులు తిమ్మన్న, దుర్గాప్రసాద్, నాయకులు హనుమంతు, హనుమన్న, మారెప్ప, జయరాజు మండలాల నాయకులు పాల్గొన్నారు.

ఆవాజ్ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఆవాజ్ నగర కమిటీ ఆధ్వర్యంలో నూతన క్యాలెండరును అవాజ్ నగర గౌరవ అధ్యక్షులు ఇస్మాయిల్, ఆవాజ్ నగర అధ్యక్ష, కార్యదర్శులు పి. ఇక్బాల్ హుస్సేన్, ఎస్ఎండి. షరీఫ్ ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఆవాజ్ నగర కమిటీ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నూతన క్యాలెండరును ఆవిష్కరించే ఆనవాయితీ ఉందని అన్నారు. ఆవాజ్ కమిటీ నగర ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతూ ఉందన్నారు. ముఖ్యంగా మైనార్టీల సమస్యలు తీసుకొని ఆవాజ్ తన గొంతు విప్పితోందని ప్రభుత్వం నుండి రావలసిన బడ్జెట్లో వాటా, ప్రజల సంక్షేమ పథకాలు , రాబట్టడం కోసం ప్రభుత్వాలపైన ఒత్తిడి పెంచడం కోసం ఆవాజ్ కమిటీ పని చేస్తుందన్నారు. ఆవాజ్ నగర ఉపాధ్యక్షులు సయ్యద్ అహ్మద్ ,చాంద్ బాషా, ఫయాజుల్ కరీం, ఎస్‌డిఖాజాపాషా, మహబూబ్ బాషా ,ఇంతియాజ్, ట్రెజరర్ ఇలియాజ్ ,నగర సహాయ కార్యదర్శులు, నాసిర్‌అహ్మద్, బషీర్‌అహ్మద్, మొహమ్మద్ నబీ ,అడ్వకేట్ మొల్ల మహమ్మద్ రఫీక్, అబ్దుల్లా ఖాన్ వాహీద్ హుస్సేన్ పాల్గొన్నారు.

ఆవాజ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఇక్బాల్ హుస్సేన్, షరీఫ్ తదితరులు

మూడేళ్ల చిన్నారికి రక్తదానం

మానవత్వం చాటుకున్న ఆర్మీ జవాన్

ప్రజాశక్తి-మద్దికేర

ప్రాణప్రయ స్థితిలోని చిన్నారికి రక్తదానం చేసి ఆర్మీజవాన్ తన మానవత్వాన్ని చాటుకున్నట్లు ఆపద్బాంధవ సేవాసమితి వ్యవస్థాపకులు సునీల్ కుమార్ తెలిపారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. గుంతకల్ ఆర్టీసి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న మూడేళ్ల చిన్నారికి ఓ నెగటివ్ రక్తం కావాలన్నారు. బాధితుల సమస్యను ఆపద్బాంధవ సేవా సమితి వారి దృష్టికి వచ్చిందని అన్నారు. రాజస్థాన్‌లో పనిచేస్తున్న ఆర్మీ జవాన్ బ్రహ్మయ్య సెలవులతో సొంత గ్రామమైన మద్దికేరకు వచ్చినట్లు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న జవాన్ బ్రహ్మయ్య తక్షణమే హాస్పిటల్‌కు వెళ్లి రక్తం దానం చేసి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. సహాయం పొందిన చిన్నారి కుటుంబ సభ్యులు జవాన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనారోగ్యంతో చికిత్స పొందుతూ సమయానికి రక్తం లేక ఆపదలో ఉండి ఇబ్బంది పడుతున్న పెద్దలకు చిన్నారులకు ఆపద్బాంధవ సేవ సమితి తరపున కావలసిన రక్తాన్ని అందిస్తామని సునీల్ కుమార్ అన్నారు.

ఎస్‌టి రిజర్వేషన్ కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలి

ప్రజాశక్తి-తుగ్గలి

బోయ వాల్మీకి సమితి బివిఎస్ రాష్ట్ర అధ్యక్షులు తలారి అంజి వాల్మీకి రాష్ట్ర నాయకులు సోమన్న నాయుడు మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం 2017 డిసెంబర్ 3న అసెంబ్లీలో ఎస్‌సి రిజర్వేషన్ బోయ వాల్మీకులకు అమలు చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపారన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కేంద్రంలో కూటమి ప్రభుత్వం ఉండడం వలన 69 ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్న వాల్మీకిల ఎస్టీ రిజర్వేషన్‌ను కూటమి ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలన్నారను. 2019 ఎన్నికలలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మన ప్రభుత్వం వచ్చిందంటే బోయవారిని రిజర్వేషన్లకి చేస్తానని హామీ ఇచ్చి ఉన్నారన్నారు. బిజెపి,టిడిపి ,జనసేన పార్టీలు ద్వారా బోయ వాల్మీకులకు ఎస్టీ రిజర్వేషన్ సాధ్యమవుతుందన్నారు. కూటమి ప్రభుత్వం తక్షణమే అమలు చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరారు. మాజీ ఎంపిటిసి ఆంజనేయులు, నాయకులు ఎర్ర శంకర్, ఈశ్వరయ్య, పూల శంకరయ్య, చరణ్ నాయుడు, దేవేంద్ర నాయుడు, పూలశివుడు, మధునాయుడు, శేఖర్ నాయుడు, కిషోర్ నాయుడు, ఈశ్వర్ నాయుడు,శ్రీరాములు నాయుడు, జి.టేక్ నాయుడు, రామకృష్ణ నాయుడు పాల్గొన్నారు.



ప్రభుత్వ ప్రింటింగ్‌ప్రెస్ యూనియన్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

నూతన సంవత్సర క్యాలెండర్ గవర్నమెంట్ ప్రింటింగ్ ప్రెస్ యూనియన్ (టిఎన్‌టియుసి యూనియన్) ఆధ్వర్యంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అశోక్ కుమార్, జిల్లా అధ్యక్షుడు వై.నర్సింహులు ఆధ్వర్యంలో ఘనంగా ఆవిష్కరించారు. ట్రేడ్ యూనియన్ నాయకులు రసూల్‌ఖాన్, గవర్నమెంట్ ప్రింటింగ్ ప్రెస్ ఎంప్లాయిస్ నాయకులు సెక్రెటరీ బి.దశరథ రామనాయుడు, పి చెన్నకేశవులు, బి.శ్రీనివాసులు, ఇ.రాజశేఖర్‌గౌడ్, మక్బూల్ బాష, హనీఫ్, వాసుగోపాల్, రజాక్ , హబీబుల్లాఖాన్, జాజ్‌అహ్మద్, అంబేద్కర్ రచ్చబండ సేవాసమితి అధ్యక్షులు, టి. శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఘనంగా మస్తానయ్య స్వామి ఉరుసు

ప్రజాశక్తి-తుగ్గలి

తుగ్గలి మండలంలోని జి. ఎర్రగుడి గ్రామంలో శుక్రవారం మస్తానయ్యస్వామి ఉరుసు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. జి.ఎర్రగుడి గ్రామానికి చెందిన ప్రజలతోపాటు ,వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు మస్తానయ్య స్వామి దర్గాను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచులు రామచంద్రారెడ్డి, బిసి వెంకటస్వామి, మాజీ వైస్ ఎంపిపి బీసీ చంద్రశేఖర్ యాదవ్, ఎమ్మెల్యే తమ్మారెడ్డి మనవుడు తుగ్గలి చంద్రశేఖర్ రెడ్డి ,వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు జిట్టా నగేష్ యాదవ్, వైసిపి వాలంటీర్ విభాగం జిల్లా అధ్యక్షులు హనుమంతు, జడ్‌పిటిసి పులికొండ నాయక్, మాజీ జడ్‌పిటిసి నారాయణ నాయక్, తదితరులు దర్గాను దర్శించుకున్నారు. జొన్నగిరి ఎస్ఐ జయ శేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న పత్తికొండ ఎమ్మెల్యే శ్యాంకుమార్

ఘనంగా సావిత్రిబాయి జయంతి

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండ మండలం జెఎం తాండ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలు కళ్యాణి అధ్యక్షతన సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కెఇ. శ్యాం కుమార్ పాల్గొని సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే చేసిన సేవలు చాలా గొప్పవని అన్నారు. సావిత్రిబాయి పూలేని ఆదర్శంగా తీసుకొని జెఎంతండా పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు కళ్యాణి కృషి చాలా గొప్పదని అన్నారు. కళ్యాణి జెఎం తండా పాఠశాలలో ఇద్దరు విద్యార్థుల నుండి 40 మంది విద్యార్థులు పాఠశాలకు వచ్చేలా కృషి చేశారని కొనియాడారు. ఎమ్మెల్యే ఉపాధ్యాయురాలు కళ్యాణికి శాలువా వేసి సత్కరించారు. టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు సాంబశివరెడ్డి, ఎంఇఒ తిమ్మారెడ్డి, రమేష్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.